క్లుప్తంగా

సీఎం నుంచి ఉగాది పురస్కారం స్వీకరణ



సీఎం నుంచి ఉగాది పురస్కారం అందుకుంటున్న తులసీనాథం నాయుడు

పలమనేరు: పలమనేరుకు చెందిన తెలుగుభాషా సంరక్షకులు, స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పైనేని తులసీనాథం నాయుడు శనివారం విజయవాడ తుమ్మలగుంట కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకున్నారు. గత రెండు దశాబ్దాలుగా ఆయన తెలుగు భాషాభివృద్ధి కోసం రాష్ట్రంలో కార్యక్రమాలతో పాటు సాహితీ రంగంలో రచయితలు, కవులను ప్రోత్సహిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా అందజేసే ఉగాది పురస్కారాలకు ఆయన్ను కూడా ఎంపిక చేసి ప్రదానం చేసింది. అవార్డు స్వీకరించడంపై సాహితీ అభిమానులు, కవులు, రచయితలు ఆయన్ను అభినందించారు.

మండల వాసికి..



కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకుంటున్న వెంకటరత్నం

వి.కోట: ఉగాది పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో మండలానికి చెందిన ఉపాధ్యాయుడు, కవి, రచయిత కొఠారి వెంకటరత్నం పురస్కారం అందుకున్నారు. శ్రీ నాగయ్య కళా క్షేత్రంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు చేతుల మీదుగా ఆయన ఉగాది పురస్కారం అందుకున్నారు. ఆయన తెలుగు భాషకు చేసిన సేవలకు గాను కవులు, సాహిత్యం విభాగంలో ఈ పురస్కారం ప్రకటించారని ఆయన తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్



పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల పంచాయతీ మిట్టూరులోని చిల్లర అంగడి సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఆయన కథనం..మిట్టూరుకు చెందిన సి.గోవిందు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో దాడులు చేసి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 14 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చగా రిమాండుకు ఆదేశించినట్లు తెలియజేశారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు ప్రజలు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోపనీయంగా ఉంచుతామన్నారు.

కల్యాణం.. కమనీయం



ఉభయదారులకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు: వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నారాయణస్వామి వారికి అభిషేకంతో పాటు కల్యాణోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి చిత్తూరు నగరానికి చెందిన విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం భక్తులందరికీ తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన శ్రీదేవి ప్రసాద్ దంపతులు ఉభయ దారులుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చెన్నై హైకోర్టు లాయర్ గాంధీ, ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశ్వర్ రెడ్డి, అర్చకులు విష్ణు స్వామి, గోవిందస్వామి భక్తులు పాల్గొన్నారు.

అభయ ప్రదాయినిగా కొమ్మే పెల్లమ్మ

యాదమరి: భక్తులు కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా, అభయ ప్రదాయినిగా కొమ్మే పెల్లమ్మ కొలువై ఉందని ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రచేను వద్ద కొమ్మేపెల్లమ్మ అమ్మవారి వార్షికోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి వేదపండితులచే ప్రత్యేక అభిషేకాలు, ఆగమ శాస్త్రం ప్రకారం పూజలు చేశారు. అనంతరం భక్తులకు విశ్వరూప దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

విశ్వావసు.. షడ్రుచుల ఆనందం



పుంగనూరు: పూజలందుకున్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి

తెలుగు నూతన సంవత్సరాది వేడుకలు పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాలు భక్తులతో కిటకిటాడాయి. ప్రత్యేక పూజలు చేసి, పంచాగ పఠనం చేశారు.

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఉగాది పచ్చడి పంపిణీ
- శ్మశాన వాటికల్లో ఆత్మీయుల సమాధుల వద్ద పూజలు
- పితృదేవతల సంస్మరణ

పుంగనూరు: శ్రీవిశ్వావసు నామ నూతన సంవత్సర ఉగాది పురస్కరించుకుని ఆదివారం హిందువులందరూ ఘనంగా సంబరాలు నిర్వహించారు. వేకువజాము నుంచి పట్టణంలోని కోనేటి వద్ద శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు శివాలయాలు, గంగమ్మ ఆలయాలలో భక్తులు ఉపవాస దీక్షలతో ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పంచాంగ పఠనం చేసి, భక్తులకు మామిడి, వేప, బెల్లం, చింతపండు కలిపిన ప్రసాదాలను పంపిణీ చేశారు. తెలుగు ప్రజలందరూ తమ ఇళ్లలో పూజలు చేసి, ఉగాది పచ్చడి స్వీకరించారు. పితృ దేవతలకు, వ్యవసాయ క్షేత్రాలకు పూజలు చేశారు.

సదుంలో..

సదుం: మండల వ్యాప్తంగా ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు చేసి ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. అలాగే ఇళ్లలో ఉపవాస దీక్షలతో ఇలవేల్పులకు పూజలు చేశారు. పితృదేవతలకు, సాయంత్రం తమ ఆత్మీయుల సమాధుల వద్ద పూజలు చేసి, బట్టలు పెట్టారు.

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల (కల్లూరు): ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆదివారం మండల వ్యాప్తంగా తెలుగు వారందరూ ఘనంగా వేడుకలు నిర్వహించారు. పెద్దలను సంస్మరిస్తూ బట్టలు పెట్టారు. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. విశ్వావసు నామ సంవత్సరం (కొత్త తెలుగు సంవత్సరం)సందర్భంగా ఆలయాల్లో అర్చకులు పంచాగ పఠనం చేశారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో శ్రీవిశ్వావసు నామ నూతన సంవత్సర ఉగాది వేడుకలను ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణ కార్యక్రమాలు వేడుకగా సాగాయి. కొన్ని స్వచ్ఛంద, ధార్మిక సంస్థలు ఉగాది పచ్చడి ప్రాశస్త్యాన్ని వివరించి పట్టణంలో పంపిణీ చేశాయి. షడ్రుచుల వల్ల ఆరోగ్యానికి కలిగే మేలు గురించి తెలియజేశాయి. కాగా ఈ ప్రాంతంలో ఉగాది రెండో రోజైన వరుస తొడుగు పండుగను ఘనంగా నిర్వహించడం పరిపాటి.



పలమనేరు: బజారువీధి, అంజనాద్రి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు

వెంకటేగౌడ శుభాకాంక్షలు

నూతన తెలుగు సంవత్సరాది పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలందరికీ మేలు కలగాలని, భగవంతుని కరుణా కటాక్షాలతో పంటలు సమృద్ధిగా పండి రైతులు సంతోషంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ శుభాకాంక్షలను తెలిపారు. మరోవైపు స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సైతం నియోజకవర్గ వాసులకు పండుగ శుభాకాంక్షలను తెలిపారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండల వ్యాప్తంగా నూతన తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి గుమ్మానికి వేప పూత, మామిడి తోరణాలు కట్టారు. వాకిళ్లను పలు రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి ఉగాదికి స్వాగతం పలికారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల పంచాంగ శ్రవణం చేశారు. ఏడాదంతా వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఇష్ట దేవతలను ప్రార్థించారు. శ్మశాన వాటికల్లో పితృ దేవతలకు పూజలు చేశారు.





పెద్దపంజాణి: బెరపల్లె, ఆకులవారిపల్లెలో సమాధుల వద్ద పూజలు చేస్తున్న ప్రజలు

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండల వ్యాప్తంగా పలు ఆలయాల్లో ఉగాది పండుగ ప్రత్యేక పూజలు చేశారు. బైరెడ్డిపల్లె బాటగంగమ్మ ఆలయం, సల్లాపురెమ్మ ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, కోదండరామస్వామి ఆలయం, శేషాద్రిస్వామి ఆలయం, నాగిరెడ్డిపల్లెలోని సోమేశ్వరస్వామి ఆలయం, చీలంపల్లెలోని కపిలేశ్వరస్వామి ఆలయం, పాతపేటలోని చెన్నకేశవస్వామి ఆలయం, కార్వేటికొండపై వెలసిన శ్రీ ధ్యానాభిరామస్వామి ఆలయం, కోట్రేపల్లెలోని కాళభైరవేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు పంచాంగ శ్రవణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



కుప్పంలో..

కుప్పం: కుప్పంలో సంప్రదాయబద్ధంగా ఉగాది వేడుకలు నిర్వహించారు. ఆలయాల్లో ఉగాది ప్రత్యేక పూజలు చేశారు. పంచాగ శ్రవణం పఠించారు. ఇక, శ్మశాన వాటికల్లో తమ ఆత్మీయుల సమాధుల వద్ద ప్రజలు పూజలు చేసి పితృదేవతలను స్మరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉగాది పచ్చడి పంచుతూ శుభాకాంక్షలు తెలిపారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: మండల వ్యాప్తంగా ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆనవాయితీ ప్రకారం శ్మశానాలలో తమ పెద్దల సమాధుల వద్ద ప్రత్యేక పూజలు చేసి స్మరించారు. తాతలు ముత్తాతలకు వస్త్రాలతో పెద్దలకు పెట్టె కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఉపవాసాలతో పూజలు చేసి పచ్చడి పంచారు.



కుప్పం: డీకే పల్లె గ్రామ శ్మశాన వాటికలో సమాధుల వద్ద చేస్తున్న పూజలు

రంజాన్ ప్రార్థనలకు ఈద్గాలు సిద్ధం

పుంగనూరు: నెల పాటు కఠోర ఉపవాస దీక్షల్లో ఉన్న ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను వేడుకగా నిర్వహించేందుకు సన్నద్ధులయ్యారు. ఆదివారం సీఐ రామ్‌భూపాల్, ఎస్‌ఐ లోకేష్‌తో పాటు అంజుమన్ కమిటీ ప్రతినిధులు ఇబ్రహీం, జాఫర్, మౌలానా ఫజులుల్లా, జబివుల్లా, ఇస్మాయిల్, ఆరీఫ్ తదితరులు ఈద్గా ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ చేస్తున్న ఏర్పాట్లను సీఐ తదితరులు పరిశీలించారు. పట్టణంలోని ముస్లింలు వేలాది మంది ర్యాలీగా ఉదయం 8 గంటలకు ఈద్గా ప్రాంతానికి చేరుకుని మతపెద్దల నేతృత్వంలో ప్రార్థనలు చేస్తారని, అనంతరం అక్కడే ఉన్న కబరస్థాన్ (శ్మశానవాటిక)లో తమ ఆత్మీయుల సమాధుల వద్ద నివాళులు అర్పించనున్నట్టు తెలియజేశారు. ఇక, కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్‌ఎస్ పేట, తోపుమఠం లోని ఎంఎం ఈద్గా మైదానం వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు.



పుంగనూరు: ఈద్గా ప్రాంతంలో పరిశీలిస్తున్న సీఐ రామ్‌భూపాల్ తదితరులు

సదుంలో..

సదుం: నెల రోజుల ఉపవాస దీక్షల అనంతరం మండలంలో సోమవారం రంజాన్ పర్వదిన వేడుకలకు ఈద్గా సన్నద్ధమైంది. స్థానిక కాలేజీరోడ్డులోని ఈద్గా మైదానాన్ని సామూహిక ప్రార్థనల కోసం సిద్ధం చేశారు. పాలమంద, బూరగమంద, ఊటుపల్లె, చింతపర్తివారిపల్లె, చెరుకువారిపల్లె గ్రామాలలో ముస్లింలు ప్రార్థనలు చేయనున్నారు.

నోటీస్ బోర్డు

1న ఉగాది పురస్కారాలు

పుంగనూరు: పట్టణంలోని హిందూ దివ్య జ్ఞానజ్యోతి సంస్థ, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఏప్రిల్ 1న పట్టణ ప్రముఖులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేయనున్నట్టు ఆదివారం ఆ సంస్థ అధ్యక్షుడు వెంకటేష్ తెలిపారు. స్థానిక త్యాగరాజస్వామి కళాక్షేత్రంలో మధ్యాహ్నం 12 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, మొత్తం 8 మంది ప్రముఖులకు జీవిత సాఫల్యం, విశిష్ట సేవ, జ్ఞానజ్యోతి పురస్కారాలు, అలాగే నాయీ బ్రాహ్మణులను సన్మానించడంతోపాటు పురస్కారాలతో గౌరవించనున్నట్టు తెలియజేశారు.

5 నుంచి సోమేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

పుంగనూరు: స్థానిక ప్యాలెస్ ఆవరణలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 5 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దీనికి సంబంధించి ఆదివారం ఏర్పాట్లకు పూనుకున్నారు. చివరి రోజున రుద్రాభిషేకంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేపటి నుంచి ఇంటర్ క్లాసులు

వి.కోట: 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఏప్రిల్ 1వ తేది నుంచి, అలాగే ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు 7వ తేదీ నుంచి తరగతులు పునః ప్రారంభించనున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

అవ్వాతాతల వేలిముద్ర పడేనా?

- పంపిణీ కోసం కొత్త స్కానింగ్ యంత్రాలు
- గుడిపాల మండలానికి 130 యూనిట్లు పంపిణీ

గుడిపాల: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో సాంకేతిక సమస్యలు లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. సిబ్బందిని సైతం ముందుకు వెళ్లకుండా చేస్తున్నాయి. ఈ సమస్యను గట్టెక్కించేందుకు అధికారులు కొత్తగా అధునాతన వేలిముద్ర(ఎంఎఫ్ఎస్ 110, ఎల్–1 ఫింగర్ ప్రింట్) స్కానర్లను గుడిపాల పరిధిలో 17 సచివాలయాలకు సమకూర్చారు. వీటితో అయినా ఏప్రిల్ నుంచి పింఛన్ల పంపిణీ కష్టాలు తీరుతాయో లేదోనన్న బెంగ లబ్ధిదారులను వెంటాడుతోంది.మండల పరిధిలో 17 సచివాలయాల్లో అర్హులైన పింఛనుదారులకు ప్రతి నెలా ఒకటో తేదీన సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేస్తున్నారు. పాత బయోమెట్రిక్ పరికరాలతో తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వేలిముద్రలు సరిగ్గా పడక కొంతమంది అవస్థలు పడుతున్నారు. సచివాలయాల చుట్టూ రెండు, మూడు సార్లు తిరిగి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. ముఖ్యంగా వృద్ధుల వేలిముద్రలు పడక పోవడం, తరచూ స్కానర్లు మరమ్మతులకు గురవుతుండడం, సాంకేతిక సమస్యలు తదితర కారణాలతో పింఛన్ల పంపిణీ ప్రక్రియ అనుకున్నంత వేగంగా జరగకపోవడంతో అటు లబ్ధిదారులు, ఇటు సిబ్బంది ఇబ్బంది పడాల్సి వస్తోంది. వేలిముద్రలు పడని వారికి అధికారుల ప్రత్యేక అనుమతితో సిబ్బంది ఆ తర్వాత పింఛను డబ్బులు అందించాల్సి వస్తుంది. కొత్త ఎల్–1 వేలిముద్ర స్కానర్లతో వేలిముద్రల నమోదు సమస్య పరిష్కారమవుతుందని మండల అధికారులు అభిప్రాయ పడుతున్నారు. సచివాలయ సిబ్బంది కొత్తగా అందించిన వేలిముద్రల స్కానర్లతోనే ఏప్రిల్ నెల పింఛన్లు అందజేస్తారని తెలిపారు.



ఆలయ సూచిక బోర్డు పడదోసి..!

- జనసేన బ్యానర్‌ను పెట్టారు
- సోషల్ మీడియాలో వైరల్
- హిందువుల మనోభావాలను దెబ్బతీశారని మండిపడుతున్న నెటిజన్లు

గంగవరం: మండలంలోని దండపల్లె కురప్పల్లె గ్రామ శివాలయానికి వెళ్లే దారికి చేరుకునే సూచిక బోర్డును జనసేన నాయకులు పడదోసి దాని స్థానంలో తమ పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించిన బ్యానర్‌ను ఏర్పాటు చేయడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి. కురప్పల్లె వద్ద బీరేశ్వరస్వామి, బత్తేశ్వరస్వామి, అజ్జి బీరేశ్వరస్వామి ఆలయాలకు దారి తెలియజేసేందుకు గతంలో ఆలయ నిర్వాహకులు పట్టణ సమీపంలోని దండపల్లె రోడ్డు వద్ద ఏర్పాటు చేశారు. ఈ ఆలయంలోనే విశేషంగా నవ గ్రహ, మృత్యుంజయ హోమాలతో పాటు కురబ జయంతి వేడుకలను సైతం ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఆలయానికి చేరుకోవడం ఎలాగో తెలియని భక్తులకు గుండుబావి పక్కన దండపల్లె రోడ్డులో ఈ సూచిక బోర్డు ఉపయోగపడేది. అయితే కొంతమంది జనసేన నాయకులు అక్కడ ఉన్న దేవుళ్ల బోర్డును తొలగించి ఆ స్థానంలో తమ పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించిన బ్యానర్‌ను ఏర్పాటు చేయడంతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. స్థానికులు, హిందువుల మనోభావాలను దెబ్బతీశారంటూ జనసేన నాయకుల తీరుపై మండిపడుతున్నారు. ఉన్న బోర్డును తొలగించడం, ఆ స్థానంలో రాజకీయ పార్టీ బ్యానర్ ఏర్పాటు చేయడం సరికాదని ఆక్షేపిస్తున్నారు.



జనసేన నాయకులు కూలదోసిన ఆలయ బోర్డు





ఆలయ సూచిక బోర్డు స్థానంలో ఏర్పాటు చేసిన జనసేన బ్యానర్, దండపల్లె కురప్పల్లె వద్దనున్న మరో బోర్డు